సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 14 । జనవరి । 2024



'పది'లో ప్రథమంపై గురి

పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది.

IIలో ▸



సమరానికి 'సై'

సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో కోడిపందేలకు బరులు సిద్ధమవుతుండగా.. పోలీసులు వాటిని ధ్వంసం చేస్తున్నారు.

IIలో ▸



మద్యం స్వాధీనం

పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి చేసి స్థానికంగా విక్రయిస్తున్న ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు.

IIలో ▸

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): భక్తులపాలిట కొంగుబంగారం భీమవరం మావుళ్లమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మావుళ్లమ్మవారి 60వ జాతర మహోత్సవాలను శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో దేవదాయ శాఖ సహకారంతో 60 ఏళ్లుగా వైభవోపేతంగా ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఉత్సవాలకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని, పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేసిందన్నారు. కమిటీలు, పాలకవర్గం, అధికారులు సమష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వై భద్రాజీ, ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగన్న బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, ఏఎస్ రాజు, ఉత్సవ కమిటీ నాయకులు రామాయణం గోవిందు, కొప్పుల సత్తిబాబు, తూటారపు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు



పూజలు చేస్తున్న కలెక్టర్లు ప్రశాంతి, ఢిల్లీరావు

భీమవరం (ప్రకాశంచౌక్): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని, ఇది పల్లె పండుగ, రైతుల పండుగ, పాడిపంటల పండుగగా నిలుస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లు, రైతు లోగిళ్లలో ధాన్యం రాసులు, పిండి వంటలు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని ప్రతి ఇంట్లో సిరులు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ ప్రశాంతి శుభాకాంక్షలు తెలిపారు.

కుటుంబ సభ్యులతో కలిసి..

విజయవాడ సెంట్రల్: విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కుటుంబసభ్యులతో కలిసి కలెక్టర్లు ఎస్.ఢిల్లీరావు, పి.ప్రశాంతి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పెనుమంట్ర ఏఈఈ బదిలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని పెనుమంట్రలో ఆపరేషన్స్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంఎస్ఎస్‌టీ బాబూజీని బదిలీ చేస్తూ ఈపీడీసీఎల్ చైర్మన్, ఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదేశాలు జారీ చేశారు. బాబూజీని భీమవరం రూరల్ ఆపరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీవారి క్షేత్రం ముస్తాబు

ద్వారకాతిరుమల: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో సంక్రాంతి సంబరాలు జరిపేందుకు ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. శ్రీవారి కొండపైన తూర్పు ప్రాంతాన్ని శనివారం సిబ్బంది ముస్తాబు చేశారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేశారు. భోగిమంటలు సిద్ధం చేశారు. ఈ ప్రాంతాన్ని మహిళలు ముగ్గులతో తీర్చిదిద్దారు.

సంక్రాంతి సంబరం.. సంప్రదాయాలకు దర్పణం

పల్లెగూటికి పండగొచ్చింది.. సంక్రాంతి సంబరాలను మోసుకొచ్చింది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణంలా మూడు రోజుల పెద్ద పండుగకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ముస్తాబైంది. ఊరూవాడా భోగి వేడుకలకు సర్వం సిద్ధం చేయగా.. రంగవల్లుల పోటీలు, డూడూ బసవన్నల సందళ్లు ఆకట్టుకుంటున్నాయి.

\- సాక్షి నెట్‌వర్క్



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ముగ్గుల పోటీలు



కాళ్ల : జక్కరంలో భోగిమంటలకు సిద్ధం



వీరవాసరం : డూడూబసవన్నల సందడి

తుది ఓటరు జాబితాకు కసరత్తు

- తొమ్మిది నెలల పాటు సాగిన ప్రక్రియ
- గడువు పొడిగిస్తూ వచ్చిన ఎన్నికల సంఘం
- జిల్లాలో 85,900 కొత్త ఓట్ల నమోదు
- 22న తుది జాబితా ప్రచురణ



భీమవరం కలెక్టరేట్‌లో ఈవీఎం అవగాహన కేంద్రం

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల సమరానికి త్వరలో తెరలేవనుండగా ఓటరు జాబితాలు సిద్ధం చేసే కసరత్తు తుది దశకు చేరుకుంది. కొత్త ఓట్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి స్పెషల్ సమ్మరీ రివిజన్ గడువు ముగిసింది. ముసాయిదా జాబితా మేరకు జిల్లాలో 14,47,509 ఓటర్లు ఉండగా ఈనెల 22న ఎన్నికల సంఘం తుది జాబితా ప్రచురణ చేయనుంది.

18 ఏళ్లు నిండిన వారందరికీ.. జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించే లక్ష్యంతో ఏటా ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరీ రివిజన్ నిర్వహిస్తుంది. గతేడాది ఏప్రిల్ 15 నుంచి ఈ ప్రక్రియ చేపట్టింది. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటా సర్వే నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, మృతిచెందిన వారి ఓట్ల తొలగింపులు, అభ్యంతరాల స్వీకరణ తదితర ప్రక్రియల అనంతరం అక్టోబర్ 28న ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఎన్నికల ఏడాది కావడంతో ఇంకా మిగిలి ఉన్న కొత్త ఓటర్లు నమోదు, మార్పులు, చేర్పులకు డిసెంబర్ 9 వరకు ఎన్నికల సంఘం (ఈసీ) అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈనెల 5న తుది జాబితా ప్రచురించాల్సి ఉండగా ఈనెల 12 వరకు ఈసీ మరో అవకాశం కల్పించింది. ఈ మేరకు 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో పని చేసింది. ఓటు హక్కు ప్రాధాన్యతపై అధికారులు కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన పథకాలు పొందుతున్న వారిలో 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి దరఖాస్తు చేయించారు.

14.47 లక్షల ఓటర్లు : స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో కొత్త ఓట్ల నమోదు కోసం 94,563 ఫాం-6 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అర్హత కలిగిన 85,900 కొత్త ఓట్లు నమోదయ్యాయి. ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపు కోసం 1,04,875 ఫాం-7 దరఖాస్తులు రాగా, చిరునామా, డూప్లికేట్ ఓటరు కార్డు కోసం 1,27,477 ఫాం-8 దరఖాస్తులు వచ్చాయి. ముసాయిదా గణాంకాల మేరకు జిల్లాలో 14,47,509 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 7,09,608, మహిళలు 7,37,824, ఇతరులు 77 మంది ఉన్నారు. ఈనెల 22న ఈసీ తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్టు అధికారులు తెలిపారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
భీమవరం	1,20,857	1,27,428	46
ఆచంట	87,602	89,839	0
పాలకొల్లు	94,391	97,936	10
నరసాపురం	82,545	83,020	1
ఉండి	1,08,235	1,19,343	2
తణుకు	1,13,226	1,19,343	6
తాడేపల్లిగూడెం	1,0,2752	1,07,631	12

తెలుగు సంస్కృతికి పట్టం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



పెంటపాడులో భోగి మంటలను వెలిగిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు పట్టం కడుతూ సంక్రాంతి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పెంటపాడులో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌరీదేవి అమ్మవారి ఆలయం వద్ద శనివారం నిర్వహించిన సంక్రాంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. భోగిమంటలు వెలిగించి, గంగిరెద్దు విన్యాసాలు, గొబ్బెమ్మల పూజలు, ముగ్గుల పోటీలను తిలకించారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి వేడుకలను సంప్రదాయబద్ధంగా ఐక్యంగా జరుపుకోవడం సంతోషమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగు సంప్రదాయాలను పరిరక్షిస్తూ రాష్ట్రంలో వేల ఆలయాలకు కోట్లాది రూపాయల నిధులు అందించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. అలాగే ప్రజలు, గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డ్రెయిన్లు, రోడ్ల కోసం లక్షలాది నిధులు అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా సీఎం జగన్ గెలుపు కోసం అందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన కోరారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా..



అప్సడా వైస్ చైర్మన్ రఘురామ్‌ను అభినందిస్తున్న ఆక్వా రైతులు

తాడేపల్లిగూడెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఆక్వా రైతులకు జీవింతాంతం రుణపడి ఉంటానని అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. కేబినెట్ హోదా పొంది తాడేపల్లిగూడెం వచ్చిన ఆయన్ను ఆక్వా రైతులు, అభిమానులు కలిసి అభినందనలు తెలుపుతున్నారు. శనివారం పట్టణంలోని నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొటోకాల్ నుంచి కేబినెట్ మంత్రి హోదా కల్పించడం ఆనందంగా ఉందన్నారు. తనపై అంతులేని అభిమానం రైతులు చూపిస్తుంటే జన్మ ధన్యమైనట్టేనని భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. కేబినెట్ హోదాతో బాధ్యత మరింత పెరిగిందని, ఆక్వా రంగం, రైతులకు మరింత మేలు చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. రాష్ట్రంలో 4.65 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండగా అప్సడా ఏర్పడిన తర్వాత పది ఎకరాలు ఉన్న ప్రతి రైతుకు యూనిట్ రూ.1.50 వంతున విద్యుత్‌ను సీఎం జగన్ అందించారన్నారు. తద్వారా ఆక్వాజోన్‌లోకి 3.45 లక్షల ఎకరాలు వచ్చాయని, రైతులంతా ఆనందంగా ఉన్నారన్నారు. ఇప్పటివరకు రూ.3,400 కోట్లను ఆక్వా రంగానికి సీఎం జగన్ కేటాయించారన్నారు. ప్రభుత్వ సబ్సిడీలతో ఆక్వా రంగం పురోగతి సాధించిందన్నారు. రఘురాంను ప్రాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ నాయకులు, ఏపీ శాఖ అధ్యక్షుడు భాస్కర్‌రాజు, ఆక్వా రైతులు సత్కరించారు.

టిడ్కో లబ్ధిదారులకు సంక్రాంతి కానుక

- పేదల సొంతింటి కల సాకారం
- పాలకొల్లులో 704 మంది లబ్ధిదారులకు ఫ్లాట్ల అప్పగింత
- చీఫ్ విప్ ముదునూరి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గోపి



పాలకొల్లులో టిడ్కో లబ్ధిదారులకు ఫ్లాట్లు అప్పగిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, స్టేజీ దిగి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు అర్బన్: పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు సంక్రాంతి కానుకగా ఫ్లాట్లు అప్పగిస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పాలకొల్లు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన టిడ్కో లబ్ధిదారులకు ఫ్లాట్ల అప్పగింత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 35 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాల కోసం రూ.25 వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం భూములు కొనుగోలు చేసిందన్నారు. అయితే దివంగత వైఎస్సార్ కొనుగోలు చేసిన భూముల్లో టీడీపీ ప్రభుత్వం వ్యాపారం చేసి అసంపూర్తిగా టిడ్కో ఫ్లాట్లు నిర్మించడంతోనే లబ్ధిదారులకు అప్పగింతలో ఆలస్యమైందన్నారు. రెండో విడతలో 704 మందికి సంక్రాంతి కానుకగా ఫ్లాట్లు అప్పగిస్తున్నామన్నారు. గతంలో పట్టా ఇచ్చేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ చేసి అప్పగిస్తున్నామని చెప్పారు. వచ్చే నెలాఖరుకు మొత్తం లబ్ధిదారులందరికీ ఫ్లాట్లు అప్పగిస్తామన్నారు.

త్వరలో బ్రిడ్జి నిర్మాణం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులకు అడుగడుగునా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లాట్లు అప్పగిస్తుంటే మైక్ కోసం ఎలా గొడవ చేశారో అక్కచెల్లెమ్మలంతా స్వయంగా చూశారన్నారు. టిడ్కో గృహాల వద్ద నరసాపురం ప్రధాన కాలువపై త్వరలో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ మాట్లాడుతూ పాలకొల్లులో ఇళ్ల స్థలాలు పూడిక చేస్తుంటే ఎమ్మెల్యే నిమ్మల అడ్డుకుంటున్నారని, మెడికల్ కళాశాల నిర్మిస్తుంటే సహించలేక ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఎమ్మెల్యే బైఠాయింపు

చీఫ్ విప్ ముదునూరి మాట్లాడిన అనంతరం ఎమ్మెల్యే నిమ్మల మైక్ ఇవ్వాలని కోరడంతో ఆనంద ప్రకాష్ మైక్ తీసుకుని మాట్లాడబోతుండగా ఎమ్మెల్యే నిమ్మల ప్రొటోకాల్ పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేజీపై నుంచి దిగిపోయి నేలపై బైఠాయించి గొడవ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలపై దురుసుగా మాట్లాడారు. దీంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేసి ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నడపన గోవింద రాజులనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు చందక సత్తిబాబు, విప్పర్తి ప్రభాకరరావు, పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు, సచివాలయాల జిల్లా అధికార ప్రతినిధి ఖండవల్లి వాసు, పట్టణ యూత్ అధ్యక్షుడు చందక సత్తిబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దా చంద్రకళ, ఆలయాల చైర్మన్లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఏపీ పీపీ సంఘంలో స్థానం



కార్యవర్గంలో స్థానం పొందిన ఏలూరు పీపీలు

ఏలూరు (టూటౌన్): ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ టెన్యూర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ముగ్గురికి స్థానం దక్కింది. వీరంతా ఏలూరు పీపీలు కావడం విశేషం. అసోసియేషన్ సమావేశం శనివారం గుంటూరులో జరగ్గా ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆచంట వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా డీవీ రామాంజనేయులు, సీహెచ్ రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. నూతనంగా వస్తున్న చట్టాలు, సవరణలతో కూడిన మార్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు. వీరిని పలువురు న్యాయవాదులు అభినందించారు.

క్లుప్తంగా

పండుగ వేళ క్రీడల నిర్వహణ భేష్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

ఆకివీడు: మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. స్థానిక గుమ్ములూరు రోడ్డులోని గాలిబ్ చెరువు సమీపంలో సంక్రాంతి సంబరాలులో భాగంగా శనివారం మహిళలకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కనుమూరి ఆనందవర్మ సహకారంతో విజేతలకు రూ.1.50 లక్షల నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మోషేన్ రాజు మాట్లాడుతూ పండుగ రోజుల్లో ప్రజలందరితో సరదాగా గడిపేందుకు వివిధ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేతలకు మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, టీటీడీ సభ్యులు గాదిరాజు సుబ్బరాజు, మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, సీనియర్ నాయకులు మేడిది జాన్సన్, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, మహిళా సమాఖ్య రాష్ట్ర డైరెక్టర్ పళ్లెం అరుణ కుమారి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం బహుమతులను అందజేశారు. తొలుత క్రీడా పోటీలను నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ ప్రారంభించారు.

పదిలో ప్రథమంపై గురి

పదో తరగతి ఫలితాల్లో గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జిల్లా ఆ తరువాత ఆ స్థాయి ఫలితాలు సాధించడంలో వెనుకబడింది. రాష్ట్ర విభజన అనంతరం గత నాలుగేళ్లలో సైతం అంతంత మాత్రమే. ఈ పరిస్థితిని అధిగమించి ఈ ఏడాది జిల్లాను ప్రథమస్థానంలో నిలిపే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. ఈ మేరకు విద్యార్థులకు తర్ఫీదునిస్తూ, ఉపాధ్యాయులకు లక్ష్యాలు నిర్దేశిస్తూ మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తోంది.

- సీ, డీ గ్రేడ్‌ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు
- ఉపాధ్యాయులకూ అనేక ప్రోత్సాహకాలు
- పూర్వ విద్యార్థుల భాగస్వామ్యానికి చోటు
- జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతిలో అనుకున్న ఫలితాలు సాధించాలంటే ముందుగా చదువులో వెనుకబడి సీ, డీ గ్రేడుల్లో నిలుస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యాశాఖాధికారులు గుర్తించారు. ఈ మేరకు సీ, డీ గ్రేడుల విద్యార్థులను మరింత సాన పెట్టడానికి ఉపాధ్యాయులకు తగిన సూచనలిచ్చారు. అన్ని సబ్జెక్టుల్లో అన్ని పాఠాలూ చదవడం వారికి సాధ్యం కాదనే ఉద్దేశంతో పరీక్షల్లో కచ్చితంగా వస్తాయనే ప్రశ్నలను వారికి కేటాయించి వాటి సమాధానాలను ఒకటికి రెండుసార్లు వారు చదివేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక రోజు ఒక సబ్జెక్టులో ముఖ్యమైన ప్రశ్నలను వారికి తెలిపి మునటి రోజు వారు దానికి సమాధానం పేపర్‌పై రాయడంతో పాటు ఉపాధ్యాయులకు అప్పజెప్పేలా తర్ఫీదునిస్తున్నారు. ఇలా రోజు విడిచి రోజు ఒక సబ్జెక్టుపై వారికి పట్టు వచ్చేలా చేస్తున్నారు.

అదనపు తరగతులు : పదో తరగతి విద్యార్థులకు నూరు రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వారిని పరీక్షలకు సమాయత్తం చేయడంలో భాగంగా ప్రతిరోజూ పాఠశాల సమయంలోనే కాక ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల తెరవక ముందు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకూ, అలాగే సాయంత్రం పాఠశాల విడిచిన తరువాత 4 గంటల నుంచి 5.30 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలకు నెల ముందు నుంచి రాత్రి 8 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు.

ఉపాధ్యాయులకు అనుకూలంగా.. విద్యార్థుల ఉత్తమంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు విద్యా శాఖ తగిన ప్రోత్సాహకాలు అందించనుంది. బోధించే సబ్జెక్టుల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే ఉపాధ్యాయులకు కోరుకునే ప్రాంతాలకు బదిలీ చేయడంలో ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల అవార్డులకు సిఫార్సు చేసే అవకాశాలు ఉన్నాయి.



ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం

ర్యాంకులూ సాధించేలా..

ఇక ఏ, బీ గ్రేడ్ విద్యార్థులపై కూడా ఉపాధ్యాయులు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పది పరీక్షల అనంతరం జరిగే ఐఐఐటీ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించేలా వారిని తీర్చిదిద్దాలని, జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు, ఇతర పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించేలా వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతోనూ..

మెరుగైన ఉత్తీర్ణత ఫలితాలు సాధించే దిశగా వేస్తున్న అడుగుల్లో పాఠశాల పూర్వ విద్యార్థులను, విదేశాల్లో స్థిరపడిన గ్రామస్తులను, గ్రామ పెద్దలను భాగస్వాములను చేసేందుకు విద్యాశాఖాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అదనపు తరగతుల్లో విద్యార్థులకు దాతల సాయంతో స్నాక్స్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో దాతలు ముందుకు రాగా మిగిలిన ప్రాంతాల్లో కూడా దాతల సహకారం తీసుకోవడానికి కృషి చేస్తున్నారు.

జిల్లాలో పదో తరగతి చదివే విద్యార్థులు

12,130

	బాలురు	బాలికలు
ప్రభుత్వ పాఠశాలల్లో 7,077	3,339	3,538
ప్రైవేటు పాఠశాలల్లో 5,053	2,561	2,492

మెటీరియల్ పంపిణీ చేస్తాం



ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు జారీ చేశాం. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా ముఖ్యమైన ప్రశ్నలు, జవాబులతో కూడిన మెటీరియల్‌ను జెడ్పీ చైర్మన్ సహకారంతో ఈ నెల 18వ తేదీ నుంచి విద్యార్థులకు అందిస్తాం. గిరిజన ప్రాంతాల్లో పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విదేశాల నుంచి తమ ప్రాంతాలకు వచ్చిన వారెవరైనా ఉంటే తమ ప్రాంతాల్లోని విద్యార్థులతో మమేకమయ్యేలా ప్రయత్నాలు చేసి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– పి.శ్యామ్‌సుందర్, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి

రోడ్డు ప్రమాదంలో తాపీ కూలీ మృతి



కరిపెట్టి సురేష్ మృతదేహం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ అక్కడికక్కడే మృతి చెందగా, మరో కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పొంగుటూరు గ్రామానికి చెందిన కరిపెట్టి సురేష్ (34), పొన్నగంటి మణికంఠ భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం వీరిద్దరూ బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం కొయ్యలగూడెం వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా, ఎస్‌బీఐ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సురేష్ ఘటనా స్థలంలో మృతి చెందగా, మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భోగభాగ్యాల భోగి





భోగి మంట, భోగి పిడకల దండను ధరించిన చిన్నారి (ఫైల్)

తాడేపల్లిగూడెం: భోగుల్లో భోగుల్లో భోగభాగ్యాల భోగుల్లో.. భోగి మంటల భోగుల్లో తెల్లార కుండానే పల్లెపల్లె అంతాను ఎర్రని కాంతుల భోగుల్లో.. అంటూ ఓ సినీ కవి భోగి భాగ్యం గురించి వివరించడం తెలిసిందే. భోగి భాగ్యమే.. పండుగలోనే పరమార్థం ఇమిడి ఉంది. శీతాకాలంలో వచ్చే ఈ పండుగ నాటికి శరీరంలో తేమ శాతం తక్కువగా ఉంటుంది. ఈ తేమ శాతం పెంచడానికి పండగ సందర్భంగా ప్రతి ఇంటా వండే సంప్రదాయ పిండి వంటలైన అరిసెలు, పొంగడాలు వంటివి తినడం వల్ల శరీరానికి మేలు చేస్తాయి. ఆవు పేడతో చేసిన పిడకలను భోగి మంటల్లో వేయడం వల్ల కార్బన్ డైయాక్సైడ్‌ను దూరం చేస్తుంది. ఆవు పేడతో చేసిన దండలను భోగి రోజున పిల్లల మెడల్లో వేస్తారు. ఉష్ణ నియంత్రణ కోసం భోగి దండలను పిల్లల మెడలో వేసే సంప్రదాయం ఇంకా ఉంది. అంతే కాక రుగ్మతల నివారణ, వాతావరణం తాలూకా సమస్యలకు పరిష్కారం సంక్రాంతి పండుగ ద్వారా లభిస్తుంది. వేకువ జామున సూరీడు తలుపుతట్టే వేళ.. హరిలో రంగ హరి అంటూ వచ్చే హరిదాసును హరికి మారుగా చూస్తారు. ఆయనకు బియ్యం దక్షిణగా సమర్పిస్తే పుణ్యం కలుగుతుందనుకుంటారు. ఇక సన్నాయి బూరతో డప్పు వాయిద్యంతో చేసే హంగామాలో పల్లెల్లో పండుగ శోభ సంతరించుకుంటుంది.

పొరుగు రాష్ట్రాల మద్యం స్వాధీనం



తణుకులో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

తణుకు: పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి చేసి స్థానికంగా విక్రయిస్తున్న ముఠా సభ్యులను శనివారం తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి గ్రామానికి చెందిన అరవ ఫణీంద్ర కుమార్‌తోపాటు తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన గుంపన నాయుడు అలియాస్ ముసిలి నాయుడు, ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన ఓడూరి వీరభద్రం అలియాస్ బద్రి అనే వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ వివరాలు వెల్లడించారు. ఫణీంద్రకుమార్ గతంలో గోవాలోని ఓ రిసార్టులో పనిచేసి మానేశాడు. అప్పట్లో ఉన్న పరిచయాలతో అక్కడి నుంచి అక్రమ మార్గంలో మద్యం బాటిళ్లను రప్పించి స్థానికంగా విక్రయిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావులకు అందిన సమాచారంతో ఆటోలో తరలిస్తున్న 189 మద్యం బాటిళ్లను తణుకు మండలం తేతలి వైజంక్షన్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మన రాష్ట్రంలో సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ మార్గంలో దిగుమతి చేసుకుని స్థానికంగా విక్రయించే వారిపై నిఘా ఉంచినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో తెలంగాణ మద్యం పట్టివేత

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో తెలంగాణ మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై నంబూరు చంటిబాబు చెప్పారు. ఆగిరిపల్లికి చెందిన పరసా ప్రసాద్ అనే వ్యక్తిని శనివారం ఎస్సై సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని రూ.1.20 లక్షల విలువ గల 240 క్వార్టర్ బాటిల్స్, 84 ఫుల్ బాటిల్స్, స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.



దెందులూరులో టెంట్లను తొలగిస్తున్న పోలీసులు



నిడమర్రులో బరిని ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

సమరానికి సై

- సంక్రాంతి బరికి సిద్ధమైన పందెంకోళ్లు
- బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు
- ఈ ఏడాది బౌన్సర్ల రక్షణలో బరులు
- పందేలలో చేతులు మారనున్న రూ.కోట్లు

'ఏరా.. దేగమామ.. ఈ పెద్ద పండక్కి నాతో బరిలోకి దిగుతావేంటి. తేల్చు కుందామా' అంటూ తొడగొట్టి అడిగింది పచ్చకాకి కోడిపుంజు

'చాల్లేరా.. బామ్మర్ది.. నేను కత్తికట్టి బరిలోకి దిగితే. నువ్వెంత? నీ తొడ ఎంత? నాతో పరాచికమాడితే ప్రాణాలు పోతాయ్ జాగ్రత్త' అంది దేగ

'బాగా జీడిపప్పు, వేటమాసంతో దిట్టంగా మేపినట్టున్నారు.. అందుకే రంకెలేత్తున్నావ్..' అంది పచ్చకాకి..

ఏదైతే ఎందిరా.. మన పెద్ద పండక్కి మనకున్న డిమాండ్ దేనికి ఉండదు.. అంటూ కాలు దువ్వుతూ యుద్ధానికి సిద్ధమవుతున్నాయి.

కైకలూరు/ఏలూరు టౌన్ : పందెం కోళ్లు బరితెగిస్తున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో జోరుగా కోడిపందేల బరులు సిద్ధమవుతుండగా, మరో వైపు హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం కోడిపందేలు, జూదం నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టింది. మరో కొద్ది గంటల్లో ఎలాగైనా కోడిపందేలు నిర్వహించాలని నిర్వాహకులు పట్టుదలతో ఉన్నారు. ఏటా సంక్రాంతి మూడు రోజులు ఏలూరు, భీమవరం, కైకలూరు, తాడేపల్లిగూడెం, ఐ.భీమవరం, గణపవరం, కొల్లేరులంక గ్రామాలు, భుజబలపట్నం, దెందులూరు, ఆకివీడు, దంపగడప వంటి ప్రాంతాలు కోడిపందేలు భారీ స్థాయిలో జరుగుతుంటాయి.



అసలే ఎన్నికల ఏడాది

ఈ ఏడాది ఎన్నికలు జరగనుండటంతో కోడిపందేలు భారీ స్థాయిలో జరిగే అవకాశాలు ఉన్నాయి. గతేడాది కంటే ఎక్కువ గ్రామాల్లో బరులు ఏర్పాటు కానున్నాయి. పందేలకు ప్రత్యేక అతిథులుగా ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. పందేలను తిలకించేవారిని కట్టడి చేసేందుకు ఈ ఏడాది బరుల వద్ద బౌన్సర్లను రక్షణగా ఏర్పాటు చేయనున్నట్లు చెబుతున్నారు.

బరుల ధ్వంసం.. టెంట్ల తొలగింపు

పూర్వ ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే పలు చోట్ల ఏర్పాటు చేసిన బరులను పోలీసులు ధ్వంసం చేస్తున్నారు. వేలేరుపాడు, కుక్కునూరు ప్రాంతాల్లో పోలవరం డీఎస్పీ రత్నరాజు ఆధ్వర్యంలో ఎస్సై రామకృష్ణ సిబ్బందితో ధ్వంసం చేయించారు. నిడమర్రు సీఐ సుభాష్ ఆధ్వర్యంలో కోడిపందేలు, పేకాట శిబిరాల స్థలాలను ధ్వంసం చేయించారు. పెదపాడులో సంప్రదాయ క్రీడలు ముద్దు అంటూ ఎస్సై చల్లా కృష్ణ యువతకు అవగాహన కల్పిస్తున్నారు.

బరులను ధ్వంసం చేయిస్తున్నాం



సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, పేకాట, గుండాట వంటివి నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించవద్దంటూ గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశాం. కోడికత్తుల తయారీదారులను అదుపులోకి తీసుకున్నాం. బైండోవర్ చేశాం. జిల్లాలో అనేక ప్రాంతాల్లో పేకాట జూదరులను అరెస్టు చేశాం. బరులను ధ్వంసం చేశాం. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– డి.మేరీ ప్రశాంతి, ఎస్పీ, ఏలూరు జిల్లా

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు


ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


పట్టణంలో దోమల నివారణ మందును స్ప్రే చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో దోమల నివారణకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ అన్నారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు పట్టణంలో శనివారం 28, 29, 30 వార్డుల్లో శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.అప్పారావు పర్యవేక్షణలో పారిశుద్ధ్య సిబ్బందిచే దోమల నివారణకు మలాథియాన్ మందును డ్రెయిన్‌లలో పిచికారి చేశారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతంలో ఆయిల్ బాల్స్‌ను వదిలారు. కొండయ్య చెరువులో గంబుషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన రూరల్ సీఐ నాగేశ్వరరావు


తణుకులో మంత్రి కారుమూరిని కలిసిన తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును తణుకు రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన జీవీవీ నాగేశ్వరరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


పోలీసులు గుర్తించిన గుర్తు తెలియని మృతదేహం

తణుకు: తణుకు మండలం పైడిపర్రులోని ముగురు కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి పైడిపర్రులోని స్థానిక సంపత్ వినాయకస్వామి దేవాలయం సమీపంలోని కాల్వలో చనిపోయిన్నట్లు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తణుకు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


తణుకు లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు టౌన్: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా శనివారం తణుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మల్టిపుల్ చైర్మన్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని తణుకు లయన్స్ క్లబ్ ఆవరణలోని మెల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. పలువురు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు, దామెర రంగారావు, పీవీ రమణ, ఎంఆర్ కోటేశ్వరరావు, చీకటి శ్రీనివాసరావు, పీ నాగ భూషణంలతో పాటు తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాతం నాగరాజకుమార్, కార్యదర్శి ఎం రవిరిజనాల్డ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో విమర్శలు


సకలజన సమ్మేళన పాదయాత్రలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శనివారం పెంటపాడు మండలంలో సకల జన సమ్మేళన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను చేరువ చేశామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. డ్వాక్రా రుణమాఫీ పేరుతో చంద్రబాబు మహిళలను మోసం చేశాడన్నారు. అధికారం చేపట్టిన తరువాత సున్నవడ్డీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా వారి ఆత్మహత్యలకు చంద్రబాబు కారకుడయ్యాడని విమర్శించారు. నేడు అక్క, చెల్లెమ్మలకు డ్వాక్రా రుణాల ద్వారా ఆధరణ చేస్తూనే మరోపక్క రైతులకు వ్యవసాయాన్ని జగనన్న పండుగ చేశారని తెలిపారు. ఇటీవల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి పంట నష్టం అంచనాలను వేయించారన్నారు. బీసీలను చంద్రబాబు వాడుకొని వారికి రాజకీయ లబ్ది లేకుండా లోబర్చుకున్నాడని అన్నారు. చంద్రబాబు హాయాంలో ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. బీసీలను ఏనాడు చంద్రబాబు చూసిన పాపానా పోలేదన్నారు. రాష్ట్రంలో ఎన్నో దేవాలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు అందించి హిందూ ధర్మపరిరక్షణకు కృషి చేశారన్నారు. రాబోయే 5ఏళ్ల సీఎంగా మళ్లీ జగనన్న రావాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పెంటపాడు కళాశాల సెంటర్ నుంచి ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాల, రెడ్డిల రామాలయం, సంఘం మేడ, గౌరీదేవి ఆలయం, కోనేరు చెరువు మీదుగా పెంటపాడు కొత్త పోలీస్‌స్టేషన్, సంతమారెట్ వరకు పాదయాత్ర చేశారు. ఈ యాత్రలో పలువురు ఆప్యాయంగా మాట్లాడుతూ వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు ఇంటి వద్ద మహిళలు మంత్రికి హారతులిచ్చారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు దారి పొడవునా పుష్పగుచ్ఛాలు అందిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవబత్తుల నాగమణి, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జామి కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్లు ఎస్ ప్రకాశరావు, కర్రి వరహాలరెడ్డి, ఏఎంసీ వైఎస్ చైర్మన్ చొడగిరి చినబాబు, మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు చికటమిల్లి మంగరాజు, సొసైటీ అధ్యక్షులు కైగాల గణపతి, పలు గ్రామాల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు


తణుకులో మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐఎంఏ వైద్యులు

తణుకు అర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నూతనంగా కమిటీ ఏర్పడిన సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కుదారి ఆనంద్, డాక్టర్ ఎంవీ సుబ్బరాజు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలసి మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందచేశారు. నూతనంగా ఏర్పడిన ఐఎంఏ కమిటీకి మంత్రి అభినందనలు తెలిపారు.

సామాజిక న్యాయం పాటిస్తున్న సీఎం జగన్


తణుకులో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనంద్ ప్రకాష్

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని భుజానికి ఎత్తుకుని పారదర్శక పాలన అందిస్తున్నారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. తణుకులో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కొందరివాడు కాదు అందరివాడన్న విషయాన్ని చాటిచెప్పే క్రమంలో విజయవాడలో 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనా విధానాలను ఒంటపట్టించుకున్న ఏకైక నాయకుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని అన్నారు. ఈనెల 19న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ విజయవాడకు తరలి రావాలని కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై ఉన్న అభిమానం, గౌరవాన్ని సీఎం జగన్ చాటారని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతితోపాటు అగ్రవర్ణాల్లోని పేదలకు అండగా నిలిచిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చోడే జోషి, తణుకు మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు కత్తుల జెస్‌పాల్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి సబ్బితి రాజేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ యూత్ ఉపాధ్యక్షుడు కారుమంచి యోహాన్, వైఎస్సార్‌సీపీ పట్టణ క్రిస్టియన్ మైనారిటీ నాయకులు బింకం అనిల్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు జాలే సుబ్బారావు, నాయకులు రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


పెదతాడేపల్లిలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఆటలోనూ గెలుపోటమిలు సహజమని, ఓటమి స్ఫూర్తితో గెలుపు వైపు పయనించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్ అన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లిలో సంక్రాంతి ముగ్గులు, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొట్టు విశాల్ మాట్లాడుతూ లక్ష్యం వైపు చిత్తశుద్ధితో కృషి చేస్తేనే విజయం సాధించవచ్చన్నారు. కుటుంబ సమేతంగా ఈ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణ కుమారి, పెదతాడేపల్లి సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, పసుమర్తి మునీంద్ర, ఆలపాటి కాశీ విశ్వేశ్వరరావు, పరిమి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అందంగా మెరిసి..మైమరపించి..

- రంగవల్లులతో నిండుతున్న లోగిళ్లు
- ఘనంగా సంక్రాంతి సంబరాలు


పెంటపాడులో ముగ్గులపోటీలు పరిశీలిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ


తణుకులో ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న మంత్రి కారుమూరి

పెంటపాడు: రంగవల్లులంటే మహిళలకు మక్కువ..ముగ్గులు అద్దేందుకు పండగ సమయాన్ని సందడిగా వినియోగిస్తుంటారు. పెంటపాడు మండలంలోని వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌరీదేవి అమ్మవారి ఆలయం వద్ద శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నాకరు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా ఐక్యంగా జరుపుకోవడం సంతోషమన్నారు.ఈ కార్యక్రమంలో పెంటపాడు వెలమసంక్షేమ, అభివృద్ధి సంఘ సభ్యులతో పాటు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఏఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, చోడగిరి చినబాబు, ఎంపీపీ దాసరి హైమావతి, కైగాల శ్రీనివాస్, గుండమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే ముదునూరుపాడు గ్రామంలో శ్రీరామారెడ్డి యువజన సంఘ సభ్యులు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ముదునూరుపాడు రెడ్డి యువజన సంఘ సభ్యుల అందజేశారు.

ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం

తణుకు అర్బన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 18వ వార్డు గుంటూరు వారి వీధిలో వార్డు ఇన్‌చార్జ్ సప్పా బలరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల బహుమతి ప్రధానోత్సవానికి మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముగ్గుల పోటీల్లో మహిళలు, చిన్నారులు తీర్చిదిద్దిన రంగవల్లులు సుందరంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, టీపీ నాగిరెడ్డి సుధీర్‌బాబు, సన్నీ, నాని, కుడుపూడి చంద్రరావు, కొమ్మోజు రామకృష్ణ, గోడి నాగబాబు, షేక్ బాజీ, డోలా సింహాద్రి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఆర్యవైశ్య మహిళ మాటూరి శిరీష ఇంటి వద్ద ఆవరణలో రంగవల్లులతో, పూలతో మామిడి తోరణాలను అలంకరించి, తెలుగుతనం ఉట్టిపడేలా సాంప్రదాయ వస్త్రాలు ధరించి మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శారదారాణి, శ్రీకన్య, ఎం.పద్మావతి, కె.రోజా, జి.రాధిక, జి.మహాలక్ష్మి, పి.లక్ష్మి, కె.దుర్గ, కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రానికి మేలు

ఉప ముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం, రాష్ట్రంలో ప్రజలకు మేలు అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం పెంటపాడులో నలిమిల్లి గాంధీరెడ్డి స్వగృహం వద్ద స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. రాబాయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పెంటపాడు మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజల్లో వైఎస్సార్ సీపీకి మంచి ఆదరణ ఉందన్నారు. వైఎస్సార్ సీపీ హాయాంలోనే జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయలన్నారు. ప్రజల్లో వైఎస్సార్ సీపీకి ఉన్న ఆదరణ కొల్పోకుండా కార్యకర్తలంతా ఏకతాటిపై ప్రచారం చేసి రానున్న ఎన్నికల్లో జగనన్నను సీఎంను చేసే విధంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. అభివృద్ధి ప్రధాత అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందన్న సంగతిని పార్టీ శ్రేణులు ప్రజలకు తెలిజేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో చిన్న పాటి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గుండుబోగుల సాంబయ్య, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, దేవస్థానాల కమిటీ సభ్యులు జనార్ధన్, నలిమిల్లి గాంధీరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు సలుమూరి ప్రకాష్, కర్రి వరహాలరెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, సర్పంచ్, ఉప సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, కొవ్వూరి ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ దేవాబత్తుల నాగమణి, రెడ్డి సూరిబాబు, ఎస్సీ నాయకులు ఈశ్వరరావు, దేవాబత్తు బాబీ, రెడ్డి శ్రీను, బర్రల జయరాంబాబు, ఏఎంసీ మాజీ వైఎస్ చైర్మన్ జామి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవన విధానంలో మార్పులు మరింత ఆనందమయం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అపూర్వ స్నేహితుల సమ్మేళనాలు వల్ల జీవన విధానంలో మార్పులు మరింత ఆనందమయమైన జీవితానికి నాంది పలుకుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఒకే వేదికపై కలిసేందుకు ప్రణాళికలు రూపొందించి, అనుకున్న మేరకు అందరూ కుటుంబాలతో రావాలని నిర్ణయించుకుని, అనుకున్నదే తడవుగా రూపకల్పన చేసిన పూర్వ విద్యార్థులు 1986-89లో పెంటపాడు డీఆర్ గోయెంకా డిగ్రీ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని హంగ్రీ బర్డ్స్ వేదికగా నిర్వహించారు. 35 సంవత్సరాలు సుదీర్ఘ కాలనంతరం వివిధ స్థాయిల్లో ఉన్న మిత్రులు రాష్ట్రం నుంచే కాకుండా బెంగళూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన నాటి విద్యార్థులు ఒక చోట చేరుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకుంటూ సరదా సరదా కబుర్లతో, ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఆనందంగా గడిపారు. సంక్రాంతి పండుగకు ముందు స్నేహితులు అంతా కలిసి విద్యార్థుల సమ్మేళనం జరపడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పలువురు పూర్వ విద్యార్థులు హర్షాతిరేకాలు తెలియజేశారు. అలనాటి జువాలజీ లెక్చరర్ కె.వెంకటరామారావును సతీ సమేతంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాయి సత్యనారాయణ, అందే చంద్రశేఖర్, బత్తుల శ్రీనివాస్, ఏవీఎస్ఎన్‌మూర్తి, ఎన్.పట్టాభి, జగతా రాజా రామ్మోహన్‌రాయ్, మాజీ కౌన్సిలర్ పైబోయిన వైదేహి, ఎల్ఐసీ నాయకులు నీలం ఆశోక్‌కుమార్, నామాల శామ్యూల్ రాజు, చక్రవర్తి, కొల్లూరి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


పెంటపాడులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడులో: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పెంటపాడులో సచివాలయం-1, 3, రైతుభరోసా కేంద్రాలను శనివారం సాయంత్రం ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఆయన మాట్లాడుతూ గడచిన ముఖ్యమంత్రులు చేయలేని విధంగా అభివృద్ధి ప్రధాతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసారన్నారు. జగనన్న చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక టీడీపీ, జనసేన పార్టీలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయన్నారు. రైతులకు రుణమాఫీ, జగనన్న సురక్ష వంటి సంక్షేమ పథకాలను ప్రజల కోసం ఏర్పాటు చేశారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు మద్దతు పలికి మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, ములగాల బాబ్జి, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు ముప్పిడి సంపత్‌కుమార్, చోడగిరి చినబాబు, నల్లమిల్లి విజయానందరెడ్డి, కర్రి వరహాలరెడ్డి, కై గాల గణపతి, ఎంపీటీసీ సభ్యులు డి. నాగమణి, రెడ్డి సూరిబాబు, బొచ్చెల తాతారావు, తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, ఎంపీడీవో, పలు శాఖల అధికారులు , వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఖడ్గమాల కుంకుమార్చన


ఖడ్గమాల కుంకుమార్చన చేస్తున్న ఉపముఖ్యమంత్రి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా స్థానిక బలుసులమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ అమ్మవారికి ఖడ్గమాల కుంకుమార్చనను ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సౌదామిని దంపతులు శనివారం నిర్వహించారు. ఈ ఖడ్గమాల కుంకుమార్చనలో పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి 500 మంది దంపతులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను కనకదుర్గమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు పర్యవేక్షణలో నిర్వహించారు. బలుసులమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్లు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, ఎంపీపీ దాసరి హైమావతి దంపతులు, వట్టి బుజ్జి, ఎంపీపీ పానుకుమాటి శేషులత, నూని అనూరాధ, బొడ్డు సాయి, మద్దుకూరి నాగేశ్వరరావు, చెన్నా జనార్దనావు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైలు ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్సై జి.హరిబాబు తెలిపారు. శనివారం రాత్రి ఆయన తెలిపిన వివరాలు మేరకు 13వ తేదీ సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో బాదంపూడి నుంచి చేబ్రోలు రైల్వే స్టేషన్లు మధ్య యార్డు సమీపంలో గుర్తు తెలియని సుమారు 40 ఏళ్ల వయస్సు, చామన చాయలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని రైలు పట్టాల వద్ద గుర్తించామన్నారు. మృతుడు ఆరెంజ్ కలర్ నెక్ టీ షర్ట్, బ్లాక్ కలర్ జీన్ ప్యాంటు ధరించాడని చెప్పారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

15న లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అత్తిలి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 15న అత్తిలిలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ యాతం రాంబాబు శనివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.